నిలువ నీడ లేక అవస్థలు

వాసవీ శాంతి ధాం వద్ద బస్టాండ్ లేక ఇబ్బందులు



పెనుగొండ కళాశాల కూడలి వద్ద బస్సు కోసం రోడ్లపై పరుగులు పెడుతున్న విద్యార్థినులు

పెనుగొండ: స్థానిక కళాశాల కూడలిలో నిలువ నీడ లేక ఇటు విద్యార్థులు.. అటు వాసవీ యాత్రికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నానా అవస్థలకు గురవుతున్నారు. పెనుగొండలో ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఎయిడెడ్ విద్యా సంస్థల్లో సుమారు 3 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 1500 లకు పైగా దూర ప్రాంతాల నుంచి విద్యనభ్యసిస్తున్నారు. వీరు ఉదయం సాయంత్రం బస్సులపైనే ఆధార పడి కళాశాలకు చేరుకుంటారు. అలాగే పాటు పెనుగొండ వాసవీమాత జన్మస్థలం కావడంతో నిత్యం వందలాది మంది మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయానికి, అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధాంను దర్శించడానికి వస్తుంటారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తుంటారు. వీరితో పాటు కళాశాలకు రావులపాలెం, తణుకు, నరసాపురం, పెనుమంట్ర పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. వీరంతా ఉదయం 8 గంటల ప్రాంతంలోనూ, సాయంత్రం 5 గంటల ప్రాంతంలోనూ కూడలికి చేరుకొని బస్సుల కోసం వేచి చూస్తుంటారు. దీంతో కూడలిలో బస్టాండు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎదురు చూడాల్సి వస్తుంది. పెనుగొండ – మార్టేరు రహదారి విస్తరణకు ముందు కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బస్టాండు ఉండేది. ఏడేళ్ల క్రితం విస్తరణలో బస్టాండు కూల్చి వేశారు. బస్టాండు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా గాలికి వదలి వేశారు. వాసవీ శాంతి ధాం ఆధ్వర్యంలో బస్టాండు నిర్మాణం చేపడతారని భక్తులు ఆశించినా ఆచరణకు మాత్రం నోచుకోలేదు. దీంతో విద్యార్థులు, యాత్రికులు పడుతున్న అవస్థలు దారుణంగా ఉన్నాయి. అధికారులు స్పందించి కళాశాల కూడలిలో బస్టాండు నిర్మించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సత్వరం బస్టాండు నిర్మించాలి



పెనుగొండ కళాశాల కూడలిలో బస్టాండు నిర్మాణం సత్వరం చేపట్టాలి. ఇటు విద్యార్థులు, అటు యాత్రికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిలోనూ, వర్షాకాలంలోనూ రోడ్డుపైనే తడుస్తూ ఎండుతూ వేచి ఉంటున్నారు.

– కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, విద్యా వసతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

విద్యార్థులకు ఇబ్బందులు



నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు బస్టాండ్ ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల ఆధ్వర్యంలో చిన్న షెల్టరు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా ఉంది. వందలాదిమంది వేచి ఉండడంతో వారు నిలువడానికి ఇబ్బంది అవుతుంది. బస్టాండు నిర్మించి సమస్యలు పరిష్కరించాలి.

ఎం.రేష్మా, విద్యార్థి

క్లుప్తంగా

పంటకాలువ అధ్వానం



చినమామిడిపల్లి వద్ద బురద, చెత్తతో నిండిపోయిన పంటకాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి-సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్తా పేరుకుపోయింది. బురద పెరిగిపోయి మురుగు డ్రెయిన్‌ను తలపిస్తోంది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5 వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, త్రాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. గత ఏడాది కాలువను బాగుచేయలేదు. మళ్లీ వేసవి వచ్చేసింది. వేసవి అవసరాల రీత్యా పలు గ్రామాలకు చెందిన మంచినీటి చెరువులను ఈ కాలువ ద్వారానే నింపాలి. మరి కాలువను ఎప్పుడుబాగు చేస్తారు? అసలు బాగు చేస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మార్టేరులో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువు పడాల రామచంద్రారెడ్డి

పెనుమంట్ర: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కేకేఆర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పంచగ్రామ రెడ్డి సేవా సంఘం మార్టేరు క్రీడా ఆర్మీ సహకారంతో నిర్వహించే యోగా ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి యోగాపై శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చని యోగా గురువు పడాల రామచంద్రారెడ్డి శిక్షణ ఇస్తారని వివరించారు.

మీటింగులతో ఉపాధ్యాయులను హింసించొద్దు

భీమవరం: క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగుల పేరుతో సరైన ప్రణాళిక లేకుండా సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు తీవ్రమైన ఇబ్బంది కలుగజేయడం సరికాదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలోని అత్యధిక పాఠశాలల్లో అంతర్జాల సదుపాయం లేదని, ఒక క్లస్టర్ పరిధిలో ఒకటి లేదా రెండు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండడం వల్ల హాజరైన అతికొద్ది మంది పాఠశాల సహాయకులు ఏడు గ్రూపులుగా విడదీయడం వలన ఒక గ్రూపులో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉండడం వల్ల బోధనాభ్యాసన అంశాల గురించి చర్చకు తావు లేదని తెలిపారు. అలాగే ఒకటి రెండు తరగతులు బోధించేవారి కి, మూడు, నాలుగు, ఐదు తరగతులను బో ధించే వారికి వేరు చేయడం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరును తప్పనిసరి చేయడం, సమావేశమై అరగంట దాటితే అనుమతించకపోవడం అధికారులకు ఉపాధ్యాయులపై గల దురభిప్రాయం బయటపడుతుందన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ



సంత మార్కెట్‌లో గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: మన ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ నిషేధించాలని ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా జిల్లా కలెక్టర్, యంత్రాంగం ప్రత్యామ్నాయలు ఏర్పాట్లు చేశారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములై స్వచ్ఛందంగా ప్లాస్టిక్ ను నిషేధించాలన్నారు. అనంతరం గ్రంధి వెంకటేశ్వరరావు సంత మార్కెట్‌లో 200 మంది ప్రజలకు వబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకట రాజు సహకారంతో క్లాత్ బ్యాగును సంచులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసి స్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు నుంచి ఆచంటకు బస్సు నడపాలి

పెనుగొండ: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఆచంట మండలం వల్లూరు నుంచి ఆచంటకు ప్రత్యేక బస్సులు నడపాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సూర్యనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వల్లూరు ఎంపీ పాలెం మహిళా జూనియర్ కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయడానికి ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాల్సి ఉందన్నారు. వీరికి సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతారని అన్నారు. పరీక్ష సమయానికి విద్యార్థులు చేరుకునే విధంగా అధికారులు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

ముగిసిన సత్తెమ్మ జాతర

ఉండి: ఈ నెల 8న ప్రారంభమైన సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఉండి మండలంతో పాటు కాళ్ల, పాలకోడేరు, భీమవరం, ఆకివీడు, గణపవరం తదితర మండలాల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కలిదిండి మురళీకృష్ణంరాజు అమ్మవారికి అలంకరణ, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలిదిండి నర్సింహరాజు, వెంకట నాగసరిత, కూనాధరాజు వెంకటకృష్ణంరాజు, సాయి హషిత, కలిదిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా మొక్కల పెంపకం



రైల్వేస్టేషన్ రోడ్డులో డివైడర్ల మధ్య మొక్కలు ఎండిపోవడంతో బట్టలు ఆరేసుకున్న దృశ్యం



మిషన్‌హైస్కూల్ రోడ్డులో డివైడర్ల మధ్య అధ్వానంగా ఉన్న మొక్కలు

- నీళ్లే పోసే నాథుడే కరువు
- సమీపించిన వేసవి.. ఎండిపోతున్న మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా మొక్కల తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం లేకుండా నీరుగారిపోయింది. ప్రతిఏటా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వం అట్టహాసంగా జరుపుతోంది. స్థానికంగా మునిసిపాలిటీలో అయితే ఈ కార్యక్రమాన్ని మరీ హడావుడి చేశారు. పట్టణంలో లక్ష మొక్కలు పెంచడం ధ్యేయమంటూ, పాలకవర్గం, అధికారులు హంగామా చేశారు. దీంతో పలుధపాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం అధికారులు గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎస్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేష న్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. రోడ్డుపై తిరిగే ఆవులు, దూడలు తినేయడం, నీళ్ల వేయడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కల చచ్చిపోయాయి. సాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోనే మొక్కలకు నీళ్ల పోసేవారు లేక ఎండిపోతున్నాయి.

లక్ష మొక్కలు లేవుగానీ..లక్షల ఖర్చు

పట్టణంలో ఏకంగా లక్ష మొక్కలు నాటుతామని చెప్పారు. ప్రస్తుతం ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు, కానీ లక్షల్లో మునిసిపల్ నిధులు మాత్రం ఖర్చయ్యిపోయాయి. గత రెండేళ్లలో పట్టణంలో మొక్కలు పెంపకం కోసం రూ.5 లక్షలు ఖర్చు చేసినట్టు మునిసిపల్ రికార్డులు చెబుతున్నాయి. ప్రతిఏటా మునిసిపల్ బడ్జెట్‌లో మొక్కల పెంపకానికి నిధులు కేటాయిస్తున్నారు. కానీ కొత్తగా ట్రీ-గార్డులు మాత్రం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. అంతేకాదు, కొన్ని చోట్ల పాత ట్రీ-గార్డులు ఉన్నాయి. గతంలో మొక్కలు వేసి, ట్రీ-గార్డులు ఉంచిన ప్రాంతాల్లో ఆ మొక్కలు, పెరిగిపోయి ట్రీ-గార్డులు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఆ స్థానాల్లో తీసి, కొత్తగా మొక్కలు పాతినచోట ఏర్పాటు చేయడంలేదు. వేసవి సమీపించింది. మొక్కల సంరక్షణపై ఇప్పటికైనా దృష్టి పెట్టకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉంది.

పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని సూచించారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం కమిటీల రద్దు

పాలకొల్లు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం కమిటీలన్నింటినీ రద్దు చేసినట్లు ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడుగా ముద్దాడ గణేష్ భవాని, రాష్ట్ర అధ్యక్షుడిగా బోను దుర్గా నరేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భీమవరపు హేమ, జిల్లా అధ్యక్షుడిగా కోడె యుగంధర్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా కె.అనిల్‌కుమార్‌లను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలను త్వరలో నియమించనున్నట్లు ఆయన తెలిపారు.

కోళ్ల వ్యర్థాల మూటల తొలగింపు



కోళ్ల మృత కళేబరాల మూటలను పూడ్చి బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

పాలకోడేరు: రేలంగి చానల్ నుంచి కొట్టుకొస్తున్న కోళ్ల వ్యర్థాల మూటలను డీపీవో అరుణశ్రీ ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ సమక్షంలో మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత పొక్లెయిన్‌తో తొలగించారు. బర్డ్‌ఫ్లూ వ్యాధితో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అయితే వాటిని పౌల్ట్రీ యజమానులు శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేయకుండా మూటలు కట్టి కాలువల్లో పారేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత, ఈవోపీఆర్డీ కాలువ పొడవునా గోతులు తవ్వించి ఖననంచేశారు. అనంతరం బ్లీచింగ్, శానిటేషన్ చర్యలు చేపట్టారు. నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

పెనుగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి భవిష్యత్‌ను మెరుగ్గా తీర్చిదిద్దడమే కళాశాల లక్ష్యమని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంసీఏ విభాగం అధ్యాపకులు పి.శ్రీనివాస రెడ్డి, బీఎస్ఎన్ గుప్త, ఏఎస్ రమామణి, నవీన్‌కుమార్‌లు విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు, రెస్యూమ్ బిల్డింగ్‌లపై అవగాహన కల్పించారు.



సదస్సులో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

కార్యక్రమంలో అధ్యాపకులు కె.శశికుమార్, పీవై కృపావరంత తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

పెనుగొండ: నిరుద్యోగ యువతను నట్టేట ముంచుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి పట్టభద్రులు కంకణం కట్టుకోవాలని ప్రజా సంఘాల నాయకులు పి.మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆచంటలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు అందరూ దిడ్లకు అండగా నిలిచి చరిత్ర సృష్టించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇబ్బడి ముబ్బడిగా హామీలిచ్చి ఇపుడు సన్నాయి నొక్కాలు నొక్కుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, నరేష్, కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ముగిసిన సంకేత 2025 సింపోజియం

భీమవరం: రెండు రోజుల పాటు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకేత 2కే25 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం ఆదివారం ముగిసింది. రెండు రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం బహుమతులు ప్రధానం చేశారు. రోబో వర్క్‌షాప్‌లో ప్రథమ స్థానం పొందిన ఎస్ఆర్‌కేఆర్ మెకానికల్ విద్యార్థులకు రూ.9 వేల నగదు బహుమతి ముఖ్య అతిథులుగా హాజరైన భీమవరం ఎస్వీఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎన్వీ గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీప్రత్యూష చేతుల మీదుగా బహుమతులు అందించారు ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు మెడికల్ ఇన్నోవేషన్‌లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్వీ గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మి ప్రత్యూష మాట్లాడుతూ వైద్య రంగంలో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని అందుకు అనుగుణంగా యంత్రాల్లో కూడా ఇన్నోవేటివ్ ఆలోచనలతో వస్తే పేషెంట్లకు మరింత అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ గోపాల రాజు, డాక్టర్ ప్రత్యూష

సజ్జాపురంలో అగ్ని ప్రమాదం

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జాతీయరహదారి బ్రిడ్జిని ఆనుకున్న ఉన్న ఖాళీస్థలంలో పాత సామగ్రి, చెత్త నిల్వల్లో చిన్నగా నిప్పు రాజుకుని మంటు భారీగా ఎగసిపడ్డాయి. అయితే మంటలు ఉధృతమవుతున్న సమయంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. మంటల ఉధృతి పెరుగుతుండడంతో స్థానిక భవనాల్లో నివసిస్తున్న ప్రజానీకం భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రావడంతోనే జాతీయ రహదారి బ్రిడ్జిపై నుంచి నీటిని వదలి మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం వార్త సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది కూడా స్పందించి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే ప్రమాదంలో ఎటువంటి ఆస్థి నష్టంలేదని అధికారులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం





సామూహిక కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులు, ప్రత్యేకాలంకరణలో ఆంజనేయ స్వామి

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువు గట్టున పునర్నిర్మించిన శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అనంతరం సువర్చలా హనుమాన్ కల్యాణోత్సవం నిర్వహించారు. దంపత సమేతంగా భక్తులు పెద్ద పూజల్లో పాల్గొన్నారు. ఆలయం బయట పందిరిలో కల్యాణోత్సవాలు నిర్వహించారు. సోమవారం ఉదయం సువర్చల సహిత హనుమాన్ రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి హైదరాబాద్‌కు చెందిన నత్య గురువు డాక్టర్ ఎస్వీ భారతి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.

వైభవంగా శాంతి కల్యాణం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామివారికి మూలవిరాట్‌లు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠలు పునర్నిర్మించి జరిపి ఏడాదికాలం పూర్తయిన సందర్భంగా స్వామివారికి ఉదయం క్షీరాభిషేకాలు, హోమ పూజలు, మధ్యాహ్నం తులసీదళార్చనలు, నిర్వహించి శాంతి కల్యాణం జరిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల వేంకటాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో పలువురు దాతలు పాల్గొని స్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.



మార్టేరులో వేంకటేశ్వరస్వామివారికి హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

పేదల గుడిసెల తొలగింపు దారుణం



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భీమవరం: దౌర్జన్యంగా పేదల గుడిసెలను తొలగించడం దారుణమని, దీనికి ఎన్నికల కోడ్ అడ్డు రాలేదా అని, సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక కోర్టు పక్కన పేదల గుడిసెలను పొక్లెయిన్‌తో మునిసిపల్ అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని పేదల ఇళ్లల్లో ఉన్న సామాన్లను బయట వేసి దౌర్జన్యం చేసి ఏడు కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని సీపీఎం వ్యతిరేకించింది. చంటి పిల్లలు, వృద్ధులు ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితిలో ఎండలో ఆకలితో అలమటిస్తూ మా గుడిసెలు తొలగించొద్దని వేడుకున్నా కనికరం లేకుండా దౌర్జన్యం చేశారు. దీనిపై సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి పేదల తరపున అధికారులను నిలదీశారు.వారు మాట్లాడుతూ పేదలను మనుషులుగా గుర్తించలేరా అంటూ ధ్వజమెత్తారు. ముందుగా నోటీసు ఇవ్వలేదు, చెప్పలేదు పిడుగు పడినట్లుగా వచ్చి ఇంట్లో సామాన్లు బయట పడేయడం ఈ ప్రభుత్వానికి అధికారులకు మానవత్వం ఉందో లేదో అర్థం కాని స్థితిలో ఉందన్నారు. చట్ట ప్రకారం నిబంధనలను పాటించలేదని, కనీసం ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం ఇవ్వాలని వేడుకున్నా వినకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ అధికారుల తో ప్రజా ప్రతినిధులతో మాట్లాడి ప్రత్యామ్నాయం చూపించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పేదలకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.